

చిన్నారిపై యువకుడు అత్యాచార యత్నం

భీమవరంలో దారుణం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రభుత్వాలు ఎన్ని కఠిన చట్టాలు తెచ్చినప్పటికీ కామాంధులు పెట్రేగిపోతున్నారు. భీమవరం పట్టణంలో బుధవారం తెల్లవారుజామున ఎనిమిదేళ్ల చిన్నారిపై ఇంటి పక్కనే నివాసం ఉంటున్న భానుతేజ (21) అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. చిన్నారి, ఆమె తమ్ముడు కలిసి ఒక గదిలో నిద్రిస్తూ ఉండగా తల్లిదండ్రులు పక్క గదిలో ఉన్న సమయంలో భానుతేజ ఈ అఘాయిత్యానికి ప్రయత్నించాడు. అయితే అదే సమయంలో చిన్నారి తల్లి నిద్ర లేచి రావడంతో యువకుడు పరారయ్యాడు దీనిపై చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు యువకునిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జ్వరం .. జరభద్రం..!

వాతావరణ మార్పులతో జ్వరాలు జనాలను వెంటాడుతున్నాయి. ఇప్పటికే ఏజెన్సీలో మలేరియా కేసులు పెరగ్గా, జిల్లావ్యాప్తంగా వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న పరిస్థితి ఉంది. వైద్యఆరోగ్యశాఖ జ్వరాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. మొన్నటి వరకూ తీవ్రమైన ఎండలు, గడిచిన కొద్ది రోజులుగా వర్షాలు వెంటాడుతుండటంతో జలుబు, జ్వరం వంటి ఆరోగ్య సమస్యలు జనాలను చుట్టుముడుతున్నాయి.



- వాతావరణ మార్పులతో వైరల్, మలేరియా జ్వరాలు
- ఏజెన్సీని వెంటాడుతున్న మలేరియా
- జనవరి నుంచి ఇప్పటి వరకూ 434 మలేరియా కేసులు నమోదు
- జూన్, జులైలో ఏలూరు జిల్లాలో ఐదు వేల మందికిపైగా వైరల్ జ్వరాలు
- డెంగీపై జనంలో లోలోన ఆందోళన
- ముందస్తు చర్యలు చేపడితేనే ప్రజలకు రక్ష

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏజెన్సీలో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఏలూరు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతం బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో మలేరియా కేసుల సంఖ్య ఎక్కువగా ఉంది. జనవరి నుంచి ఇప్పటి వరకూ మొత్తం 434 మలేరియా కేసులు నమోదయ్యాయి. అత్యధిక కేసులు వర్షాకాలం ప్రారంభమైన తర్వాతే నమోదయ్యాయి. మైదాన ప్రాంతంలో ఐదు కేసులు నమోదవ్వగా, ఏజెన్సీలో 429 మలేరియా కేసులు నమోదయ్యాయి. గిరిజనులు మలేరియా జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలేరియా జ్వరాలను అరికట్టేందుకు ఇప్పటి వరకూ రెండుసార్లు స్ప్రేయింగ్, ఫ్రైడే డ్రైడే వంటి కార్యక్రమాలు చేపట్టడంతోపాటు సర్వేలైన్స్ సెంటర్లను పటిష్టం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకోవడంతో మలేరియా జ్వరాలు మరింత విజృంభించే పరిస్థితి కనిపిస్తోంది. ఏజెన్సీలో వైద్య శిబిరాలు నిర్వహించడం, మలేరియా పరీక్షలు అందుబాటులోకి తీసుకురావడం, సంబంధిత మందులు అందుబాటులోకి తీసుకురావడం చేయాల్సి ఉంది. లేకపోతే ఏజెన్సీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడనుంది. గడిచిన నాలుగు నెలల్లో డెంగీ కేసులు నమోదు కాలేదని అధికారులు చెబుతున్నారు. తాజాగా ఒక కేసు నమోదైనట్లు తెలుస్తున్నా అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. గత అనుభవాలు పరిశీలిస్తే ఏలూరు నగరంలో డెంగీ కేసులు పెద్దసంఖ్యలో నమోదైన పరిస్థితి ఉంది. దీంతో ఏలూరు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డెంగీ జ్వరాల పేరుతో ప్రయివేటు ఆసుపత్రులు రోగుల నుంచి భారీగా దోపిడీ చేసిన పరిస్థితి ఉంది. డెంగీ పరీక్షలు ఎక్కడ నిర్వహిస్తారు, డెంగీ జ్వరాలపై ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. ముఖ్యంగా ఏలూరు నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి. లేక గతంలో మాదిరిగానే డెంగీ జ్వరాలు పెద్దఎత్తున ప్రబలే పరిస్థితి ఉంది.

వణికిస్తున్న వైరల్ జ్వరాలు..


వర్షాలు కురుస్తుండటంతో జలుబు, వైరల్ జ్వరాలు పెరుగుతున్నాయి. గడిచిన జూన్‌లో వైరల్ జ్వరాలు 2,600 వరకూ నమోదవ్వగా, జులైలోనూ అదేస్థాయిలో వైరల్ జ్వరాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గడిచిన రెండు నెలల్లో ఏలూరు జిల్లావ్యాప్తంగా ఐదువేలకుపైగా వైరల్ జ్వర కేసులు నమోదైనట్లు లెక్కలు చెబుతున్నాయి. వైరల్ జ్వరాలు వస్తే రోగులు ఏవిధమైన జాగ్రత్తలు తీసుకోవాలి, వైద్యులను ఎప్పుడు సంప్రదించాలి, తాగునీరు, తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. వైరల్ జ్వరాలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో వైద్యఆరోగ్య శాఖ మరింత అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఉంది. అదే క్రమంలో ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీని అడ్డుకోవాల్సి ఉంది.

విద్యార్థుల చేరికపై దృష్టి పెట్టాలి

విద్యా ప్రమాణాలు పెంపొందించేలా కృషి చేయాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతుందని, ఈ నేపథ్యంలో విద్యార్థుల చేరికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేలా విద్యాధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం జిల్లాలోని పాఠశాలల విద్యా ప్రమాణాలపై సంబంధిత విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, యూనియన్ల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించి మాట్లాడారు. ప్రయివేటు పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉన్నారని, పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ప్రస్తుతం అందించిన స్టడీ మెటీరియల్ తాను కూడా చూశానని, చాలా బాగుందని, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు ప్రస్తుత కాలానికి అనుగుణంగా నైపుణ్యాన్ని పెంచుకుంటూ విద్యావ్యవస్థను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను సబ్జెక్టులవారీగా విభజించి ఆగస్టు 15 వరకు 'సంసిద్ధత కార్యక్రమం' పేరిట ఉదయం, సాయంత్రం ఒక గంట అదనంగా తరగతులు నిర్వహించాలని సూచించారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలో భాగంగా నిర్వహించిన 'పరాక్' సర్వే ఫలితాల్లో పశ్చిమగోదావరి జిల్లా అన్ని పారామీటర్స్‌లో వెనుకబడి ఉండడాన్ని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను, యూనియన్ నాయకులను ప్రశ్నించారు. ఈ సమావేశంలో డిఇఒ ఇ.నారాయణ, ఎపిసి శ్యాంసుందర్, ఎడి సత్యనారాయణ, డివైఇఒలు ఎన్.రమేష్, మురళీ సత్యనారాయణ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాశం, ఎపిటిఎఫ్ 1938 జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, ఎంఇఒలు పాల్గొన్నారు.


అన్న క్యాంటీన్లలో కలెక్టర్ తనిఖీలు

అన్న క్యాంటీన్ ద్వారా అందించే ఆహార పదార్థాలు శుభ్రంగా, వేడిగా, రుచిగా అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనం చేస్తున్నవారితో మాట్లాడారు. ఆహార పదార్థాలు రుచికరంగా ఉంటున్నాయా, అన్న క్యాంటీన్లు పరిశుభ్రంగా ఉంటున్నాయా, భోజనం చేయడానికి ఏదైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ప్రశ్నించి, స్వయంగా ఆమె ఆహార పదార్థాలను రుచి చూశారు. అనంతరం 40 మంది పేదలకు ఆడవారికి చీరలు, మగవారికి దుప్పట్లు, లుంగీలు, టవల్స్, టూత్ పేస్టులు తదితర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని అన్న క్యాంటీన్లను నిర్వహిస్తోందన్నారు. వివిధ పనులు చేసుకుంటూ నివశిస్తున్న పేదలు, వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే వారి కోసం తక్కువ ఖర్చుతో అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను అందించడం జరుగుతుందన్నారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో దోమలు, ఈగలు అధికంగా చేరే అవకాశం ఉందని, ఆహార పదార్థాలపై ఎప్పటికప్పుడు మూతలు వేసి కప్పి ఉంచాలన్నారు. అన్న క్యాంటీన్ల లోపల, బయట పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, వాష్ ఏరియాను కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ డిఇ రెహ్మాన్, ఎంహెచ్ఒ సోమశేఖర్, వార్డు సచివాలయం ఎమ్యూనిటీ కార్యదర్శి మోహన్‌రావు, మహిళా పోలీస్ పుష్పరాణి ఉన్నారు.

మీ సేవలు పి4కు ఆదర్శం

మళ్ల రాంబాబు సేవలను అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి - వీరవాసరం



భోజనం రుచి చూస్తున్న కలెక్టర్ నాగరాణి

వీరవాసరం తులసి కన్వెన్షన్ అధినేత మళ్ల రాంబాబు సేవలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి4 కార్యక్రమానికే ఆదర్శంగా నిలిచాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. రాంబాబు గత ఐదు సంవత్సరాలుగా మండలంలోని పలు గ్రామాల్లో నిరుపేద వృద్ధులు, ఎటువంటి ఆసరా లేని నిరాదరణకు గురైన వారికి ఇంటి వద్దకే భోజనం అందిస్తున్న కార్యక్రమాన్ని ఆమె బుధవారం స్వయంగా పరిశీలించారు. భోజనం తయారు చేస్తున్న విధానం, భోజనం క్యారియర్ బట్వాడా, ఆహార పదార్థాల రుచి కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. కొద్ది రోజులుగా ప్రతి సోమవారం భీమవరం కలెక్టరేట్ వద్ద నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన వారికి రాంబాబు భోజనం అందిస్తున్నారు. ఈ విషయం తెలిసిన కలెక్టర్ ఈ ప్రక్రియను ఎలా నిర్వహిస్తున్నారో తెలుసుకునేందుకు భోజనాలు తయారు చేస్తున్న వీరవాసరం తులసి కన్వెన్షన్ వద్దకు బుధవారం ఉదయమే చేరుకుని పరిశీలించి, రాంబాబును అభినందించారు. సుమారు రెండు గంటలపాటు ఆమె ఇక్కడ గడపడం విశేషం. తులసి కన్వెన్షన్ వద్ద ఏర్పాటు చేసిన కళాఖండాల ఏర్పాటుపై ఆరా తీశారు. ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, సర్పంచి చికిలే మంగతాయారు, రాంబాబు కుటుంబ సభ్యులతో కలక్టర్ ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ రాంబాబు చేస్తున్న భోజనం బట్వాడా సేవా కార్యక్రమాన్ని తన కుటుంబ సభ్యులతో పంచుకున్నానన్నారు. మానవతా దృక్పథం, సామాజిక బాధ్యతతో తులసి కన్వెన్షన్‌ను వేదికగా చేసుకుని రాంబాబు పర్యవేక్షణలో వంటలు వండి ఒక్కరోజు కూడా మానకుండా అందజేయడం అభినందనీయమన్నారు. ఎంతో హైజెనిక్‌గా వంటలు తయారు చేసి రెండొందల మందికి సమయానికి అందజేయడం విశేషమన్నారు. ఆయనకు భార్య వరలక్ష్మి, కుమార్తె గోవర్ధన్, కుటుంబ సభ్యులు ఈ సేవా కార్యక్రమం పట్ల ఎంతో ఇష్టంతో సహకరించడం అభినందనీయమన్నారు. విలువలు పడిపోతున్న ప్రస్తుత కాలంలో ఈ విధమైన సేవలందించడం నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ రామాంజనేయులు, వీరవాసరం పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ, నేతలు వీరవల్లి చంద్రశేఖర్, మళ్ల శ్రీరామమూర్తి, నళినిమోహన్, ఆర్ఐ రూజ్‌వెల్ట్, విఆర్ఒలు నాగేశ్వరరావు, సవరం సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అప్పారావు, ఇఒపిఆర్‌డి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్



రేషన్ షాపును తనిఖీ చేస్తున్న జెసి

గ్రామస్తులంతా సేవాభావం అలవర్చుకోవాలని, బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకు రావాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మండలంలోని నడిపూడి పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం పి4 బంగారు కుటుంబాల గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథి జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పి4 ద్వారా పేదరికాన్ని నిర్మూలించొచ్చన్నారు. అనంతరం గ్రామంలో రేషన్ షాపులను, గొడౌన్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ టి.సూర్యనారాయణమూర్తి, తహాశీల్దార్ జి.అనితకుమారి, నడిపూడి గ్రామ సర్పంచి కడలి బేబీ అన్నపూర్ణ, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిటిసి ఎం.కట్లమ్మ. కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ విధులు అప్పగించొద్దు

ఎంపిడిఒకు ఆశాల వినతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

సామాజిక పింఛన్ల పంపిణీ విధులు అప్పగించొద్దంటూ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన నేతలు ఎంపిడిఒ ఎం.విశ్వనాథంకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పింఛన్ల పంపిణీలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఎంపిడిఒకు వివరించారు. ఆశా వర్కర్స్ యూనియన్ మండల కన్వీనర్ జి.దుర్గాభవాని మాట్లాడుతూ తాము స్కీమ్ వర్కర్లమేనని, ప్రభుత్వ ఉద్యోగులం కాదని గుర్తు చేశారు. ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ డ్యూటీ వేయడం వల్ల తాము చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆ సమయంలో గర్భిణుల వద్ద ఉండాల్సి వస్తుంటే అధికారులు తమపై ఒత్తిడి తీసుకురావడం దారుణమన్నారు. సిఐటియు నాయకులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ చిరుద్యోగులైన స్కీమ్ వర్కర్లపై అదనపు పని భారం మోపి ఒత్తిడి చేయడం తగదన్నారు. తక్షణమే ఆ డ్యూటీల నుండి వారిని తగ్గించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎంపిడిఒ స్పందిస్తూ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.దేవి, పి.అనంతలక్ష్మి, ఎ.వెంకటలక్ష్మి, డి.నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

పిఆర్‌సి కమిషన్ నియమించాలి

ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ విజయరామరాజు, సెక్రటరీ జనరల్ ప్రకాశం

ప్రజాశక్తి - భీమవరం

12వ వేతన సవరణ అమలుకు కమిషన్‌ను నియమించాలని, మధ్యంతర భృతి వెంటనే మంజూరు చేయాలని, పెండింగులో ఉన్న కరువు భత్యం, పాత బకాయిలు వెంటనే విడుదల చేయాలని జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ పిఎస్.విజయరామరాజు, సెక్రటరీ జనరల్ జి.ప్రకాశం కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023 జులై నుంచి ఉద్యోగులకు వేతన సవరణ జరగాల్సి ఉందని పేర్కొన్నారు. రెండేళ్లు గడిచినా ఇంతవరకు దాని గురించి ప్రభుత్వం ఆలోచన చేయడం లేదని విమర్శించారు. తక్షణమే 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 2023 జులై నుండి ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి చెల్లించాలని కోరారు. సిపిఎస్ రద్దు చేసి, 2003కు ముందు నియామకం పొందిన వారికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో నెంబర్ 57ను అమలు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు ఇంకా పొజిషన్ ఐడీలు లేక జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరించి వారికి జీతాలు అందేలా చేయాలని డిమాండ్ చేశారు.

అల్లం పూర్ణిమ మృతి తీరనిలోటు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



సిపిఎం పట్టణ కమిటీ సభ్యురాలు అల్లం పూర్ణిమ మృతి పార్టీకి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక కడకట్ల 32వ వార్డులో పూర్ణిమ స్వగృహం వద్ద ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి, పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పూర్ణిమ సిపిఎం, సిఐటియు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారన్నారు. మంగళవారం బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆమె మరణించడం బాధాకరమని అన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌లో కార్మికుల కోసం నిరంతరం తపించేవారన్నారు. పూర్ణిమ నేటితరం మహిళలకు ఆదర్శనీయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ధనాల వెంకట్రావు, నేతలు ఎబి.శ్రీనివాస్, తాడికొండ జయరామ్ కృష్ణ, కొడమంచిలి బాబు, ధనాల రాజు, సోమవరపు సతీష్, కరక వెంకట్రావు, నరమాల కృష్ణ, దేశంశెట్టి సతీష్, శిద్దిరెడ్డి శేషుబాబు, యాసరపు ఎర్రినాయుడు, నంగిరెడ్డి సాయి, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా కమిటీ సంతాపం

సిపిఎం తాడేపల్లిగూడెం పట్టణ కమిటీ సభ్యురాలు అల్లం పూర్ణిమ ఆకస్మిక మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు బుధవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ ఒక ప్రకటన విడుదల చేశారు. అల్లం పూర్ణిమ మృతి సిపిఎంకు తీరని లోటని పేర్కొన్నారు. పూర్ణిమ మృతికి సిపిఎం జిల్లా కమిటీ తరపున సంతాపం, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రాష్ట్ర నాయకుల సంతాపం

అల్లం పూర్ణిమ మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర సీనియర్ నాయకులు మంతెన సీతారాం సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు.

క్షణం క్షణం.. భయం భయం..!



పడవపై ప్రయాణిస్తున్న లంక గ్రామాల వాసులు

పడవలపైనే లంకగ్రామాల ప్రజల రాకపోకలు

వరదలొస్తే పరిస్థితి మరింత దారుణం

వారధి నిర్మాణానికి శంకుస్థాపనతో సరి

ప్రజాశక్తి - ఆచంట

గోదావరి నదిపై ప్రయాణం సాగించుకుంటే వారికి జీవనం సాగదు. ఈ పరిస్థితి ఆచంట మండలంలోని లంక గ్రామాల్లో నెలకొంది. ముఖ్యంగా రెండు పాయల మధ్యలో ఉన్న అయోధ్యలంక గ్రామస్తుల అవస్థలు వర్ణణాతీతం. బయట ప్రపంచంలోకి అడుగు పెట్టాలంటే పడవలను ఆశ్రయించాలి. వరదొచ్చినా, గాలివాన వచ్చినా పడవ ప్రయాణం తప్పదు. దీంతో వీరంతా క్షణం క్షణం భయం నీడలో ప్రయాణాలు సాగిస్తుంటారు. మృత్యువాత పడుతున్నా వారికి పడవ ప్రయాణమే దిక్కుగా మారింది. గోదావరి నదిపై వారధి నిర్మాణాలు పూర్తయితే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని లంక గ్రామాల ప్రజలు భావిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో గతంలో కచ్చులూరు వద్ద జరిగిన బోటు బోల్తా ప్రమాదంతో వీరిలో మరలా భయం పట్టుకుంది. ప్రస్తుతం గోదావరి వరద పెరుగుతుండడంతో పడవ ప్రయాణాలు చేయాలంటేనే హడలెత్తిపోతున్నారు. దీంతో వారధి నిర్మాణం డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది.

గోదావరి మధ్యలో 3 వేల మంది..

వశిష్ట గోదావరి రెండు పాయల నడుమ అయోధ్య లంకలో సుమారు 3 వేల మంది నివసిస్తున్నారు. వీరిలో 100 కుటుంబాలు గోదావరి నదిలో చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. మిగిలిన 500 కుటుంబాలు వ్యవసాయమే వృత్తిగా చేసుకుంటూ లంక భూముల్లో కొబ్బరి, మొక్కజొన్న, తమలపాకు, జామ, అరటి, మునగ పలు రకాల కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. వ్యవసాయ, వృత్తి పరమైన అవసరాలు, ఇతర అవసరాలకు తప్పనిసరిగా గోదావరి దాటి అటు తూర్పుగోదావరి ఇటు పశ్చిమగోదావరి జిల్లాకు రావాల్సి ఉంది. నిత్యావసర సరుకులతోపాటు విద్య, వైద్య సౌకర్యాలు పొందాలంటే గ్రామం నుంచి బయటకు రావాలి. పంట ఉత్పత్తులతో పాటు చివరకు ఇంటి నిర్మాణ సామగ్రి కూడా పడవలపైనే తరలించాలి.

వెంటాడుతున్న ప్రమాదాలు..

గోదావరి నదిపై రాకపోకల సందర్భంగా పలు మార్లు గ్రామస్తులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. 2012లో పల్లెపాలెం వద్ద బోటు బోల్తా పడడంతో అదే గ్రామానికి చెందిన ఐదుగురు కనుమరుగయ్యారు. పుచ్చలంక పాయ దాటే ప్రయత్నంలో ఏడేళ్ల క్రితం ఓ రైతు నదిలో కొట్టుకుపోయారు. గత 12 ఏళ్ల కిందట తల్లి, ఇద్దరు కూతుర్లు ప్రాణాలు కోల్పోయారు.

శంకుస్థాపన చేసిన..

2014లో అయోధ్యలంక, పుచ్చలంక గ్రామాలను అనుసంధానం చేస్తూ వారధి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.50 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. గత టిడిపి ప్రభుత్వం, కూటమి ప్రభుత్వంలో ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ఈ విషయంపై కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వారధి నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి త్వరగా వారధి నిర్మాణానికి శ్రీకారం చుట్టి లంకగ్రామస్తుల పడవ ప్రయాణం భయం పూర్తిగా తొలగించాలని ఆ గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



వారధికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం (ఫైల్‌ఫొటో)

అక్రమాలకు పాల్పడితే కేసులు పెడతాం

రూ.40 లక్షల పన్ను బకాయిలుంటే మీరేం చేస్తున్నారు

పన్ను బకాయిదారులకు నోటీసులివ్వండి

డిపిఒ రామనాథరెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

పంచాయతీ నిధులకు సంబంధించి ఉద్యోగులైనా, సిబ్బంది అయినా అక్రమాలకు పాల్పడితే కేసులు పెడతామని డిపిఒ రామనాథరెడ్డి హెచ్చరించారు. గొల్లలకోడేరు పంచాయతీపై అందిన ఫిర్యాదులపై ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన సిమెంట్ రోడ్లను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శితో మాట్లాడారు. కుళాయి కనెక్షన్ల వివరాలు, ఇంటి పన్నుల వివరాలను పరిశీలించారు. ఒక గొల్లలకోడేరు గ్రామంలో రూ.40 లక్షల పన్ను బకాయిలు ఉంటే ఇక్కడ పనిచేస్తున్న వారు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చెల్లించిన వారికి రశీదులు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. పన్ను వసూళ్లలో పురోగతి లేకపోయినా, వసూలు చేసిన పన్నుల్లో తేడాలున్నా, రశీదులు ఇవ్వకున్నా చర్యలు తప్పవన్నారు. అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై ఉదాశీనంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆక్రమణలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. అక్రమ కుళాయి కనెక్షన్లు వెంటనే తొలగించాలని, పన్నులు చెల్లించని వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. ఆయన వెంట ఇఒపిఆర్‌డి రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సుజాత, పాలకోడేరు పంచాయతీ కార్యదర్శి గోపి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ దాసిరాజు

జాబ్ మేళాతో యువతకు ఉపాధి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వం, ప్రయివేటు సంస్థలు నిర్వహిస్తున్న జాబ్ మేళాతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. బుధవారం స్థానిక వైఎన్ కళాశాలలో కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాల మేరకు ఎపి ఎస్-ఎస్‌డిసి, ఎంసిఎస్, వైఎన్ కళాశాల సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్‌డిఒ దాసిరాజు ప్రారంభించారు. 19 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కళాశాల కార్యదర్శి అందే రామసతీష్ తెలిపారు. ఫార్మా, మార్కెటింగ్, బ్యాంకులకు చెందిన ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించగా 148 మంది ఎంపికైనట్లు ఎపి ఎస్ఎస్ డిసి మేనేజర్ లోకమాన్ తెలిపారు. ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, యాజమాన్య సభ్యులు సిహెచ్.సత్యనారాయణ మూర్తి, వర్మ, బల్ల వెంకటేశ్వరరావు, చింతారావు, గంధం శ్రీరామకృష్ణ, కెఎస్‌వి.రంగారావు, బి.వెంకట రత్నం, యాకోబు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని మల్లవరంలంక గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు బుధవారం దళిత జెఎసి, రాజ్యస్ట్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్, న్యాయవాది ఇంజేటి జాన్ కెనడీ మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనా విధానంతో 250 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కాకిలేటి ఆనందకుమార్, గొట్టుముక్కల సుజాత, పిల్లి నవరత్నం, నేతల రమేష్, మురాల స్వామి, వర్ధనపు సుధాకర్, గోరింకల సతీష్ పాల్గొన్నారు.

రైతులు ఇ-పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

సార్వా సాగు ప్రారంభమైన నేపథ్యంలో రైతులందరూ తప్పనిసరిగా ఇ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు అన్నారు. బుధవారం కొడమంచిలి, ఆచంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది కొత్తగా చేరారని, పంట రకం, ఊడ్చినతేదీ వంటి వివరాలను రైతు సేవా కేంద్రాల్లో తెలియజేయాలన్నారు. సార్వా నిమిత్తం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా రైతులందరూ తప్పనిసరిగా ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతు సోదరులు పాల్గొన్నారు.

వీరవాసరం: బిజిపాలెం గ్రామంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి బిన్నీబాబు సార్వా సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. పచ్చి రొట్టు ఎరువుల వాడకం, పాస్ఫో బాక్టీరియా, పొటాష్ సాల్యుబుల్ రైసింగ్ బ్యాక్టీరియా వాడకం ద్వారా రసాయన ఎరువుల మోతాదు తగ్గించుకోవచ్చన్నారు. వ్యవసాయ రుణం తీసుకోని రైతులు తక్షణం రూ.210 చెల్లించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో నమోదు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ సతీష్, విఎఎ దివ్య, రైతులు పాల్గొన్నారు.

థియేటర్లో తహశీల్దార్ తనిఖీ

ప్రజాశక్తి - మొగల్తూరు

నిబంధనలు పాటించుకుంటే చర్యలు తప్పవని తహశీల్దార్ కె.రాజకిషోర్ మొగల్తూరులోని థియేటర్ సిబ్బందికి హెచ్చరించారు. మొగల్తూరులోని చెరుకూరి (శ్రీదేవి జానకి) థియేటర్‌ను బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తినుబండారాల దుకాణం, థియేటర్ నిర్వహణ తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. సినిమా టిక్కెట్ల ధర పట్టిక, తినుబండారాల రేట్లు తదితర వాటికి సంబంధించి బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలో కచ్చితంగా పాటించాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ ముచర్ల నిరంజన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

'మిథున్ రెడ్డి అక్రమ అరెస్ట్ సరికాదు'

ఉండి: చిత్తూరు జిల్లాలో చంద్రబాబు ఎన్ని జిమ్మిక్కులు చేసినా పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఓడించలేకపోతున్నామనే అక్కసుతో దొంగ కేసులతో పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేయాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని వైసిపి ఆర్‌టిఐ వింగ్ రాష్ట్ర కార్యదర్శి బడుగు బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాజకీయ కక్షతో మిథున్ రెడ్డిని జైల్లో పెట్టించడం చంద్రబాబు కుటిల రాజాకీయానికి నిదర్శనమని తెలిపారు. మద్యం తయారీలో కొత్త బ్రాండ్లకు 14 డిస్టిలరీలకు పర్మిషన్ ఇచ్చింది చంద్రబాబేనని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో పారదర్శకంగా పాలసీని అమలు చేశారని దీంట్లో మిథున్ రెడ్డికి ఏం సంబంధమని ప్రశ్నించారు. చంద్రబాబు పెట్టే అక్రమ కేసులకు భవిష్యత్తులో లోకేష్ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని బడుగు బాలాజీ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన చేస్తోందని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. కాళీపట్నం గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి టిడిపి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, జోగి రాధాకృష్ణన్, జక్కంశెట్టి బాలాజీ, శ్యామ్ కుమార్, పాలా రాంబాబు ఉన్నారు.



రోడ్డుపై నిలిచిన డ్రెయినేజీ నీరు

అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ

రోడ్లపైనే మురుగునీరు - పెనుగొండ వాసుల అవస్థలు

ప్రజాశక్తి - పెనుగొండ

మేజర్ పంచాయతీ అయిన పెనుగొండలో ఏ వీధికి వెళ్లినా డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పంచాయతీలో 20 వార్డులు ఉండగా ఇక్కడ 30 వేల జనాభా నివాసం ఉంటున్నారు. అయితే పంచాయతీకి ఆదాయం ఉన్నా డ్రెయినేజీల నిర్మాణంపై అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. వీధుల్లోని డ్రెయినేజీ నిండి రోడ్లపై ప్రవహిస్తున్నా అధికారులకు, ప్రజా ప్రతినిధులు కనీసం అటు వైపు చూడడం లేదని, మురుగునీరు వెళ్లే మార్గం లేకపోవడం దారుణమని అంటున్నారు. ఇంటి ముందే వాడకం నీరు నిలిచిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని, దీంతో కంటి మీద కునుకు ఉండడం లేదని, దీనికితోడు రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. దుర్వాసన వెదజల్లుతోందని, కనీసం బ్లీచింగ్ వేయరని వాపోతున్నారు. ఎక్కువగా దక్షిణపేట రాజ్ గూడెం, ఎర్ర నారాయణస్వామి కాలనీ, ఎన్‌టిఆర్ కాలనీ, ఎస్‌సి కాలనీ, గుబ్బలవారి వీధి, శాంతినగర్ కాలనీలో రోడ్లపైనే డ్రెయినేజీ నీరు నిలిచిపోతోందని, దీనిపై అధికారులకు పలుసార్లు చెప్పినా ఉపయోగం లేదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెనుగొండలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా వంతెన..!

శిథిలావస్థకు చేరి ఇరువైపులా లేని రక్షణ గోడలు

ప్రజాశక్తి - వీరవాసరం

రాయకుదురు సంత వద్ద రాయకుదరు తూర్పు కాలువపై ఉన్న వంతెన ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడో నిర్మించింది కావడంతో వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో వంతెన పైనుంచి రాకపోకలు సాగించేవారు ఆదమరిస్తే కాలువలో పడే ప్రమాదం ఉంది. మూడు రోడ్ల కూడలి వద్ద వంతెనను రాయకుదరు - అరట్లకట్ల వెళ్లే మార్గంలో వంతెన ఉంది. ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. అనేక మంది ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తూ ఉంటారు. దగ్గరలోనే ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులు, రైతులు నిత్యం సంచరించే ఈ ప్రాంతంలో వంతెన ప్రమాదకరంగా ఉంది. తక్షణం వంతెన ఇరువైపులా రక్షణ గోడులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రాయకుదురులో ప్రమాదకరంగా ఉన్న వంతెన

ఆదర్శనాయకుడు అచ్యుతానందన్

ప్రజాశక్తి - వీరవాసరం

కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం వ్యవస్థాపకుల్లో ఒకరైన విఎస్.అచ్యుతానందన్‌కు సిపిఎం మండల శాఖ ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పెర్కి పాలెంలో సిపిఎం మండల కార్యదర్శి బొర్రా ఆలమహరాజు ఆధ్వర్యంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఆలమహరాజు మాట్లాడుతూ మచ్చలేని ఆదర్శనాయకుడు అచ్యుతానందన్ అన్నారు. ఈ కార్యక్రమంలో యండమూరి సుబ్బారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పెర్కిపాలెంలో అచ్యుతానంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

తణుకు : కమ్యూనిస్టు ఉద్యమ పోరాట యోధుడు విఎస్.అచ్యుతానందన్ అని ఆయన జన హృదయ నేతగా చరిత్రలో చిరకాలం నిలిచిపోతారని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు కొనియాడారు. వేల్పూరులో సిపిఎం ఆధ్వర్యంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వీరభద్రరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో చేరి సాధారణ కార్యకర్త నుండి సిపిఎంలో అత్యున్నతమైన పొలిట్ బ్యూరో సభ్యునితో పాటు ఎల్‌డిఎఫ్ కన్వీనర్‌గా శాసనసభ్యునిగా, ప్రతిపక్ష నాయకుడిగా, ముఖ్యమంత్రిగా ఇలా అన్ని పదవులు చేపట్టి అవినీతికి వ్యతిరేకంగా ఆయన చేసిన అవిశ్రాంత పోరాటం ఆధునిక కేరళకు ముఖ్య లక్షణంగా మారిందని తెలిపారు. శాఖ కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావు, కరేళ్ల అర్జున్, వాసా పోసియ్య, యండమూరి నాగేంద్ర, విశ్వనాథం సుబ్బారావు, కొడవటి శ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచంట : అచ్యుతానందన్ గొప్ప పోరాట యోధుడని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు కొనియాడారు. ఆయన మృతి పట్ల సిపిఎం మండల కమిటీ బుధవారం సంతాపం తెలిపింది. అనంతరం సిపిఎం కార్యాలయంలో అచ్యుతానందన్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా సిపిఎం మండల కార్యదర్శి మోహన్‌రావు ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. సభలో ఎస్‌విఎన్.శర్మ, తోటపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమ నాయకునిగా అనేక పోరాటాల్లో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన మృతి ఉద్యమాలకు, ప్రజలకు తీరని లోటు అన్నారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు తలుపురి బుల్లబ్బాయి, సిర్రా నరసింహమూర్తి, కుసుమే జయరాజు, బండి రంగారావు, మన్నే బ్రహ్మయ్య, నెక్కంటి కృష్ణమూర్తి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు, బాలల సంఘం నాయకులు శ్రీపాద ప్రజ్వల, శ్రీపాద ప్రభవ వాసా సురేష్ పాల్గొన్నారు.



తణుకులో..



ఆచంట : మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణమోహన్

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - వీరవాసరం

పేదరికం నుంచి పైకి తీసుకురావాలన్నదే పి4 ఉద్దేశమని తహశీల్దార్ రామాంజనేయులు అన్నారు. పి4 లబ్ధిదారుల ఎంపికపై వీరవాసరం పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ అర్హులను, అనర్హులను గుర్తించడంలో గ్రామస్తులు సహకరించాలన్నారు. ఎంపిటిసి విజయలక్ష్మి మాట్లాడుతూ పి4లో అనాథలను, తల్లిదండ్రులు లేని పిల్లలను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. గ్రామ సభకు గ్రామస్తులు పాల్గోలేకపోవడంపై చెప్పిన సమస్యలను పరిష్కరించకపోవడమేనని వార్డు సభ్యుడు గుత్తుల కృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మి, కార్యదర్శి లక్ష్మి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భీమవరం : పేద కుటుంబాలను అభివృద్ధి చేయడమే పి4 లక్ష్యమని నియోజకవర్గ పి4 ప్రత్యేక అధికారి కెసిహెచ్.అప్పారావు అన్నారు. గొరగనమూడిలో పంచాయతీ సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీ రాజు) అధ్యక్షతన పి4 పున్ణసర్వే పై బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 15 బంగారు కుటుంబాలను ఎంపిక చేశారు. గ్యాస్, విద్యుత్ కనక్షన్,,ఉద్యోగం, పెన్షన్, ఆదాయం లేని కుటుంబాలను, తాగునీటి కుళాయి, బ్యాంకు ఖాతా లేని వారిని బంగారు కుటుంబాలకు అర్హతగా నిర్ణయించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడారు. సభలో మండల ప్రత్యేకాధికారి నాగలింగాచారి, ఎంపిడిఒ రెడ్డియ్య, డ్రెయినేజీ ఎఇ దుర్గారావు, పంచాయతీ కార్యదర్శి సరళ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆచంట : సమాజంలో అత్యంత పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించి వారికి విద్య, సామాజిక ఆర్థిక సహాయం చేసే వారిని మార్గదర్శిగా గుర్తిస్తారని ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం మండలంలోని సచివాలయం సిబ్బందికి ఎంపిడిఒ కృష్ణ మోహన్ పి4 నీడ్ అసెస్మెంట్ సర్వే పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడారు. సర్వేను 3 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దుర్గా ప్రసాద్, సిబ్బంది భాగ్యశ్రీ, దీపిక, శ్వేత, మల్లిక, వరప్రసాద్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పౌష్టికాహారం అందిస్తున్నాం

ప్రజాశక్తి - మొగల్తూరు

అంగన్‌వాడీలోని లబ్ధిదారులకు పారదర్శకంగా పౌష్టికాహారం అందించడంతోపాటు ప్రభుత్వ సేవలందించేందుకు చర్యలు చేపట్టామని ఐసిడిఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి తెలిపారు. మొగల్తూరు ఐసిడిఎస్ కార్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీలతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం అంగన్వాడీ కేంద్రాలు 1626 ఉన్నాయన్నారు. ఆయా కేంద్రాల్లో ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల్లోపు చిన్నారులు 40,689 మంది, ప్రీస్కూల్ చిన్నారులు 17,680 మంది ఉన్నారన్నారు. లబ్ధిదారులందరికీ ఫేస్ రికగ్నైజ్ యాప్‌తో నమోదు చేసి పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు గ్రామస్థాయి నుండి కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతినెలా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ బి.ఊర్మిళ, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో మళ్లీ వైసిపి జెండా ఎగురవేస్తాం

పార్టీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - యలమంచిలి

జిల్లాలో తిరిగి వైసిపి జెండాను ఎగురవేసి సత్తా చూపిస్తామని వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం స్థానిక ఉమా నరసింహ కళ్యాణ మండపం వద్ద వైసిపి ఆధ్వర్యంలో 'బాబు షూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమం వైసిపి మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య వక్తగా పాల్గొన్న ప్రసాదరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు 140 హామీలు అమలు చేస్తామని, రాష్ట్రంలో సంపదను పెంచి ప్రజలకు పంచుతామని ప్రజలకు మాయమాటలు చెప్పిన చంద్రబాబు మాట తప్పారని తెలిపారు. మరోపక్క మంత్రి అచ్చన్నాయుడు మహిళలకు ఇచ్చిన రూ.1,500 ఇచ్చే హామీలు అమలు చేస్తే రాష్ట్రాన్ని అమ్ముకోవాలని మాట్లాడుతున్నారని, ఈ విషయం ఎన్నికల ముందు తెలియదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని లేని పక్షంలో రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపురం పార్లమెంటు నియోజవర్గ పరిశీలకులు మురళీ కృష్ణంరాజు, వైసిపి పాలకొల్లు నియోజవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, యడ్ల తాతాజీ, ఎంపిపి వినుకొండ ధనలక్ష్మి రవికుమార్, పొత్తూరి బుచ్చిరాజు, జోగాడ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముదునూరి ప్రసాదరాజు

నన్ను ఇబ్బందులకు గురి చేస్తున్నారు

పండిత విల్లూరు సర్పంచి లక్ష్మి

ప్రజాశక్తి - పోడూరు


పంచాయతీ కార్యాలయంలో ఏ పని జరగాలన్నా చెప్పి చేయాలంటూ టిడిపి నాయకులు గణపతి నీడి రాంబాబు తనను భయాందోళనకు గురిచేస్తున్నారని పండిత విల్లూరు సర్పంచి ఇళ్ల లక్ష్మి చంద్రిక తెలిపారు. మండలంలోని పండిత విల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి నాయకుడు గణపతినీడి రాంబాబు పంచాయతీ బోర్డ్ మెంబర్ గానీ, ఏ విధమైన హోదా లేని టిడిపికి చెందిన వ్యక్తి అని ఆమె తెలిపారు. అటువంటి సాధారణ వ్యక్తి సర్పంచి అయిన తనపై మీటింగ్ పెట్టకుండా పంచాయతీ కార్యకలాపాలకు కూడా రావడం లేదని అభాండాలు వేస్తూ మహిళనని చూడకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. 'నా మాటే వేదం, నన్ను కాదేని ఏం చేసినా నీ చెక్ పవర్ కట్ చేయిస్తానని' బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచిని అనే గౌరవం లేకుండా రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఇది పంచాయతీ కార్యదర్శి వెంకట రెడ్డి కనుసన్నల్లో జరుగుతోందని, రాంబాబుకు వస్తాను పలుకుతున్నారని తెలిపారు. వెంకటరెడ్డి, రాంబాబుతో కలిసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రాంబాబు చెప్పినట్లుగా వినకపోతే చెక్ పవర్ పోతుందని బెదిరిస్తున్నారన్నారు. తాము చెప్పినట్లు వినకపోతే నువ్వు ఎలా సర్పంచిగా ఉంటావో చూస్తానంటూ రాంబాబు సవాల్ విసిరారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్‌ఎ పితానికి తెలియపర్చానని, పార్టీ వాళ్లు చెప్పినట్లు చేయండని చెప్పారని తెలిపారు. ఓ పనికి సంబంధించి రెండు సార్లు బిల్లులు పెట్టి పంచాయతీ నిధులు డ్రా చేశానని, నిజం తెలుసుకోకుండా తనపై జిల్లా పంచాయతీ అధికారి (డిపిఒ)కు ఫిర్యాదు చేసి నా చెక్కు పవర్ క్యాన్సిల్ చేయించారని తెలిపారు. చెక్‌పవర్ రద్దును ఉపసంహరించుకోవాలని కోరారు. వాస్తవానికి రెండు పనులకు సంబంధించి రూ.1,8,000కి ఒకసారి, లక్ష 16 వేల రూపాయలకు ఒకసారి నిధులు డ్రా చేశామని దానికి సంబంధించిన బిల్లులు, కౌంటర్ సంతకాలు కూడా ఉన్నాయని తనిఖీ చేసుకోవాలని సర్పంచి సవాల్ చేశారు. వాళ్లు ఎన్ని కుయుక్తులు పన్నినా తలొగ్గే ప్రసక్తే లేదని ఆమె తెలిపారు. వైసిపి వార్డు మెంబర్లు కె.అనంత సత్య నాగేశ్వరరావు, టి.లక్ష్మి శిరీష, కె.శ్రీవాణి, పి.సుమజ, కె.కాంతారావు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సేవలు ఎనలేనివి

గొరగనమూడి సర్పంచి శివాజీ రాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

గొరగనమూడి గ్రామానికి సచివాలయ ఉద్యోగులు అందించిన సేవలు ఎనలేనివని, ముఖ్యంగా గ్రామాభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని గొరగనమూడి సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీ రాజు) అన్నారు. గొరగనమూడిలో సుదీర్ఘ కాలం పాటు పనిచేసి వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులను స్థానిక సచివాలయంలో బుధవారం సర్పంచి శివాజీరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి శివాజీ రాజు ఉద్యోగులతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా తక్షణం స్పందించి సమస్య పరిష్కారానికి ఉద్యోగులు అందించిన సేవలు మరువలేనివన్నారు. ఎంతో మంది ఉద్యోగులు వస్తూ వెళ్తూ ఉంటారని, గొరగనమూడి సచివాలయంలో పనిచేసిన ఉద్యోగులు తమకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. సత్కారం పొందిన సచివాలయ ఉద్యోగులు సత్యనారాయణ, గోపాలం, గణేష్, వేదకుమారి, రేవతి, సౌమ్య మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ సర్పంచి శివాజీ రాజు తమకు అండగా నిలబడి ఇబ్బందులు తొలగించేందుకు ఆయన అందించిన సహకారం జీవితంలో మర్చిపోలేమన్నారు. అనంతరం బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన సచివాలయ ఉద్యోగులకు సర్పంచి శివాజీ రాజు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరళ, విఆర్ఒ శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు దొంగ సురేష్, పితాని నవీన్, దిడ్ల కిషోర్, ఆర్.జానకిరామరాజు, ఎస్.ధనలక్ష్మి పాల్గొన్నారు.



ఉద్యోగులను సత్కరిస్తునన శివాజీ రాజు

ఘనంగా కోడి రామకృష్ణ జయంతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మారుతి సినిమా హాల్లో దర్శకుడు కోడి రామకృష్ణ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. పలువురు కళాకారులు, అభిమానులు కోడి రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షులు కెవి కృష్ణవర్మ మాట్లాడుతూ తెలుగు సినిమా రంగాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకొని పాలకొల్లు కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు కోడి రామకృష్ణ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేడికొండ శ్రీనివాస్, వంగా నరసింహారావు, జక్కంపూడి కుమార్, కొల్లికొండ ప్రసాద్, మానాపురం సత్యనారాయణ, కొయ్యాన సూర్యనారాయణ, ఎస్.సత్యప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామ పరిశుభ్రతతో ఆరోగ్యం

ఉండి: గ్రామం పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఎంపిడిఒ ఎంవివిఎస్.శ్రీనివాస్ అన్నారు. కలిసిపూడి గ్రామ పంచాయతీ ఆవరణలో పారిశుధ్య కార్మికులకు నిర్వహించిన సన్మాన సభలో ఎంపిడిఒ మాట్లాడారు. గతవారం జిల్లా స్థాయిలో పారిశుధ్య నిర్వహణలో 5వ స్థానంలో కలిసిపూడి గ్రామం నిలవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను సన్మానించిన గ్రామ సర్పంచి కేసబోయిన జానకి, ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావులను అభినందించారు. అనంతరం సర్పంచి జానకి, ఎంపిటిసి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ మండల స్థాయి పారిశుధ్య నిర్వహణలో ప్రథమ స్థానంలో తమ గ్రామం నిలవడం తమకు గర్వకారణమన్నారు.

నేడు డయల్ యువర్ డిఎం

నరసాపురం: ఆర్‌టిసి ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్‌టిసి డిఎం ఎస్.సుబ్బన్నరెడ్డి తెలిపారు. ప్రజా రవాణా సేవలు, కార్గో సేవలు, కార్గో డెలివరీ, విద్యార్థులకు రాయితీలు, బస్సులకు సంబంధించిన ఇబ్బందులు, విహార యాత్రలకు ప్రత్యేక బస్సులు, సలహాలు, సూచనలు, సిబ్బంది ప్రవర్తన, ప్రత్యేక బస్సుల ఫిర్యాదులుంటే 9959225486 నెంబరుకు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

'అల్లరి మూకలపై చర్యలు తీసుకోవాలి'

ఆచంట: పెనుమంచిలిలో జరిగిన జనసేన స్తూపాన్ని అల్లరి మూకలు బైక్‌తో పలుమార్లు పగలగొట్టారని వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలంటూ బుధవారం సాయంత్రం ఆచంట పోలీస్ స్టేషన్లో జనసేన ఆచంట మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. పెనుమంచిలిలో 21వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జరిగింది. అనంతరం పర్మిషన్ లేని బైక్ ర్యాలీతో గ్రామంలో సైలెన్సర్లు విప్పి పెద్దపెద్ద శబ్దాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. పెనుమంచిలిలో జైన్ దేవాలయం చుట్టూ ఉన్న ప్రహరీ గోడల్ని బైకులతో పాడు చేశారు. ఆ పక్కన దేవస్థానానికి ఆనుకుని ఉన్న జనసేన స్తూపాన్ని ఉద్దేశపూర్వకంగానే అనేకసార్లు బైక్‌తో డాష్ ఇవ్వడంతో పాటు, కుల, మతాల పేర్లతో అసభ్యకరమైన పదజాలంతో కులాల పరంగా గొడవలు తీసుకొచ్చే విధంగా అల్లర్లు నిర్వహించి కూటమి ప్రభుత్వాన్ని తిడుతూ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచంట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.